# శ్రీ రమణ జ్యోతి

మే 2019

ఈ సంచికలో ...

# Sri Ramana Jyothi

May 2019

IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ కే.యస్. గారి 59వ ప్రవచనం | తాడిమేటి సత్యనారాయణ | 3 |
| 2. | శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు | మల్లాది ఫణిమాల | 7 |
| 3. | నేను చూసిన శ్రీ బలరామరెడ్డి గారు | జి. శ్రీహరి రావు | 11 |
| 4. | శ్రీ బలరామరెడ్డి గారి స్మృతులు | ఎ.వి. రమణయ్య | 23 |
| 5. | శ్రీ భగవాన్ సేవలో | సంపాదకులు | |
| 6. | The Divine Mother | Dr.K.Subrahmanian | 30 |
| 7. | Sri Nidimusali Balarama Reddy | Editor | 35 |
| 8. | Ramana The Goal, Also The Way | | 36 |
| 9. | Words of Wisdom | | 40 |
| 10. | Lest We Forget - Prof. Shiv MohanLal | | 41 |
| 11. | Singing The Glory of Sri Ramana Kavyakantha's Sri Ramana Chatvarimsat | | 44 |
| 12. | Saints of Periapuranam Ilayankudi Maara Nayanar | | 48 |


**Events in Sri Ramana Kendram in May**

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 10th May - Punarvasu Satsang - 6.00 - 7.15 p.m.

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyoti either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు : కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్
(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)

# శ్రీ రమణాశ్రమం

ఆంగ్ల మూలం: డా॥ కే.యస్. గారి 59వ ప్రవచనం మొదటి భాగము

తెలుగు అనువాదం: తాడిమేటి సత్యనారాయణ

ఈనాడు 21.6.1993. ఆశ్రమం నుండి శ్రీ మణిగారు వచ్చారు. హైదరాబాద్ కేంద్రం స్థాపించిన తర్వాత వారు ఇదే మొట్ట మొదట రావటము. అంతేగాక ఈ దినము పునర్వసు సత్సంగం కూడా. శ్రీ మణిగారు భక్తులందరికీ చాలా పరిచయస్థులు. డా. కె.ఎస్. గారు వారి గురించి మాట్లాడుతూ ఇట్లా అన్నారు.

“నా తరఫునా, హైదరాబాద్ రమణభక్తులు తరఫునా శ్రీ మణిగారికి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను. మేమందరం రమణాశ్రమం వెళ్లినపుడు వారు మా పై చూపిన ఆదరణ, ఇచ్చిన సహాయాలను మేము మరచి పోలేము. ఆశ్రమానికి వచ్చే ఇద్దరు అతిథులను చూసుకోవడమే ఎంతో శ్రమతో కూడిన పని. కాని మణిగారు నిత్యమూ ఆశ్రమానికి వచ్చే ఎందరో భక్తులకు సౌకర్యాలను అందించే ప్రయత్నము ఎంతో కఠినమైనది. ఈ సేవ గత కొన్ని సంవత్సరాలుగా ఎడతెరిపి లేకుండా జరుగుతోంది. తాను చేస్తున్నాననే భావనయే మణిగారి మనస్సులో లేదు. వారు అలాగ చేయగలుగుతున్నారంటే కేవలం అది భగవాన్ అనుగ్రహం తప్ప మరేది కాదనే ప్రగాఢ నమ్మకం వారిది. భగవానుల పనే మణిగారు చేస్తున్నారు. మణిగారు అదృష్టవంతులు. వారికి అలాంటి సేవ చేసే అవకాశం, స్థానం లభించాయి.

శుక మహర్షి తర్వాత ఎందరో మహాత్ములు వచ్చి ఉండవచ్చు గాక. కాని భగవాన్ వలె మరొక్కరు కానరారు. ఈ ప్రపంచంలో బహుకొద్ది ఆశ్రమాల లోనే, ముఖ్యంగా రమణాశ్రమంలోనే భక్తులకు ఉచిత భోజన, వసతులు ఇవ్వబడుతున్నాయి. ఈ ఆచారం భగవాన్ తల్లిగారు మొదలు పెట్టారు. స్కందాశ్రమం వంట గదిలో ముట్టించిన అగ్ని ఈనాటికీ మండుతూ వుంది. భక్తులకు భోజనం పెడుతున్నది ఈనాటికీ ఆ అగ్నియే.

మణిగారు ఈ దినము మన మధ్యలో ఉండటం చాలా సంతషకరమైన విషయము. వారు ముందు ముందు హైదరాబాద్ రాబోయే ఎన్నో రాకలకు ఇదే మొదటి రాక అని ఆశిస్తున్నాను. వారు వారి కుమారునితో వచ్చారు. కుమారుడు ఒక ప్రవేశ పరీక్ష వ్రాయడానికి వచ్చారు. కుమారుని ఆరోగ్యం అంతగా బాగా లేనందున మణిగారు అతనితో వచ్చారు. వారి కుమారుడు త్వరలో కోలుకొంటారని, ప్రవేశ పరీక్షలో తప్పక విజయం సాధిస్తారని ఆశిస్తూ కోరుకొంటున్నాను. ఈ రోజు సత్సంగ సభ్యులు నా మాటలను వినడానికి రాలేదు. శ్రీమణిగారి మాటలను వినడానికి మేమందరము చాలా ఉత్సాహంతో ఎదురు చూస్తున్నాము. శ్రీ మణిగారిని మాట్లాడవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

(సశేషం)



*(శ్రీ నిడిముసలి బలరామరెడ్డి గారు శ్రీరమణ మహర్షి పాదసన్నిధిలో పదమూడు సంవత్సరాల పాటు నిరంతరాయంగా గడిపిన గొప్ప భక్తులు, సాధకులు. సంపన్న కుటుంబం నుండి వచ్చినప్పటికి, శ్రీ బలరామరెడ్డిగారు తనను తాను భగవాన్ బిడ్డగానే భావించేవారు. శ్రీ బలరామరెడ్డిగారి పాండిత్యం విస్తృతమైనప్పటికి, దానిని తమ సాధన కొరకే పరిమితం చేసుకొనే వారు కానీ ఎట్టి ప్రదర్శనకు ఇష్టపడేవారు కాదు. మే 11వ తేది వారి ఆరాధన దినం. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వారి వ్యక్తిత్వాన్ని వివిధ కోణాలనుండీ వ్యక్తపరిచే మూడు వ్యాసాలను ఈ సంచికలో ప్రచురిస్తున్నాము).*

## రమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# శ్రీ నిడిముసలి బలరామరెడ్డి గారు

- మల్లాది ఫణిమాల

శ్రీ నిడిముసలి బలరామరెడ్డిగారు 1933 సం॥లో మొదటిసారి శ్రీ రమణా శ్రమానికి వచ్చారు. మిగిలినవారందరూ సద్గురువుని అన్వేషిస్తూ అక్కడకు వస్తే, శ్రీ బలరామరెడ్డిగారు అప్పటికే పాండిచేరి లోని అరవిందాశ్రమంలో అయిదు సంవత్సరాలు ఉన్నారు. పాండిచెరీలోని అరవిందాశ్రమంలో నివసించే వారందరూ గట్టి నియమ నిబంధనలకు కట్టుబడి ఉంటారు. కానీ ఆ విషయం బలరామరెడ్డిగారికి ఏ మాత్రం కష్టమనిపించ లేదు. దానికి కారణం వారి తల్లితండ్రులు గొప్ప భక్తులే కాక మంచి సాధకులు కూడా కావటం. వారి తండ్రిగారు భారతదేశం మొత్తం ప్రయాణించి, ఒక సంవత్సరం పాటు పూర్తిగా మౌనం

పాటించారు. బి.వి. నరసింహ స్వామిగారు వ్రాసిన 'ఆత్మసాక్షాత్కారము' అనే పుస్తకంలో, మొట్టమొదటిసారిగా శ్రీ రమణ మహర్షి గురించి బలరామరెడ్డి గారు చదివారు. అరవిందాశ్రమంలో శ్రీ కపాలి శాస్త్రి అనే సంస్కృత పండితుడు తరచుగా శ్రీరమణ మహర్షిని సందర్శిస్తుండేవారు. మహర్షి గురించి శ్రీ కపాలిశాస్త్రి చెప్పే విషయాలు శ్రీ బలరామరెడ్డి గారిలో సంభ్రమాశ్చర్యాలను రేకెత్తించేవి. అందువల్ల బలరామరెడ్డి గారు శ్రీరమణ మహర్షి వద్దకు వెళ్ళాలని నిశ్చయించుకున్నారు.

మార్చి 1933వ సంవత్సరంలో ఒక రోజు ఉదయాన్నే రెడ్డిగారు రమణాశ్రమానికి జేరుకున్నారు. ఆయనను ఫలహారం చేయమన్నారు. ఎంతో రుచికరమైన ఇడ్లీలు వడ్డించబడ్డవి. దైవానుగ్రహం చేత ఆయన శ్రీ భగవాన్ కుడిచేతి పక్కనే కూర్చున్నారు. భోజనం వడ్డించబడగానే, తమ కుడిప్రక్కనున్న వారి వైపు తిరిగి తల ఊపటం భగవాన్ అలవాటు. అందరినీ భోజనం ప్రారంభించమని సూచన అది. కేవలం మహర్షి తల ఊపగానే, బలరామరెడ్డిగారు సంతోషంతో పొంగిపోయారు. ఆయన దానిని ఒక అందమైన, శుద్ధమైన అనుభవంగా తలచారు. ఎందువల్లనంటే, దాని మూలాన లోపలి ఆధ్యాత్మిక ప్రకాశమును ఒక మెఱుపువలె ఆయన అనుభవించగలిగారు. శ్రీ రమణా శ్రమంలో స్వేచ్ఛాయుత వాతావరణం ఆయనకు అంతులేని ఆనందాన్ని ఇచ్చింది.



శ్రీరమణ మహర్షి వచ్చినవారిని సాధారణంగా, "మీరెవరు? ఎక్కడి నుండి వచ్చారు? ఎంతకాలం ఉంటారు?" అని ప్రశ్నించరు. బలరామరెడ్డిగారు కేవలం ఒక్క రోజు మాత్రమే ఉండడానికి వచ్చారు. కనుక, ఆ సాయంత్రము, సెలవు తీసుకొనడానికి మహర్షి వద్దకు వెళ్ళారు. శ్రీ భగవాన్ ఆయనను, "మీరు ఎక్కడ నుండి వచ్చారు?" అని అడిగారు. వెంటనే ఆది శంకరాచార్యులవారి ప్రశ్న "కుత ఆయత?" (ఎక్కడ నుండి వచ్చారు?) అనేది రెడ్డిగారికి గుర్తువచ్చింది. వారు ఆ ప్రశ్నతో సంతోషించారు. ఎందుచేతనంటే ఆ ప్రశ్న ఆయనను మనో మూలానికి తీసుకుని వెళ్ళింది. ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆయన చవి చూశారు.

పాండిచేరికి వచ్చిన తర్వాత ఆయన తిరిగి "ఆత్మసాక్షాత్కారం" పుస్తకాన్ని చదవటం ప్రారంభించారు. గురువును మార్చుకోవడం సాధ్యమేనని ఆయన చదివారు. కానీ ఇది ఆయనకు మ్రింగుడు పడలేదు. మరొకసారి శ్రీ రమణాశ్రమానికి వెళ్ళాలనుకున్నారు. రెండవసారి ఆశ్రమాన్ని సందర్శించినపుడు కూడా, ఆశ్రమాన్ని ఆవరించియున్న ఆధ్యాత్మికత, ప్రశాంతతలతో ఆయన బాగా ప్రభావితులయ్యారు. శ్రీ భగవాన్ ప్రముఖ భక్తులలో ఒకరైన యోగిరామయ్య, రెడ్డిగారిని ఆహ్వానించి, మహర్షి వద్దకు తీసుకువెళ్ళి, "భగవాన్ నేనీయన తండ్రిగారిని ఎరుగుదును. ఈయన బలరామరెడ్డిగారు"అన్నారు. రెడ్డిగారు భగవానులను "ఎవరైనా తమ గురువును మార్చుకొనవచ్చునా?" అని అడిగారు.

"అవును, తప్పకుండా మార్చుకొనవచ్చును. దానికేమున్నది" అని శ్రీ భగవాన్ సమాధానమిచ్చారు. "దానికేమున్నది" అన్నప్పుడే శ్రీ భగవాన్ బలరామరెడ్డిగారి గురువును మార్చేశారు. రెడ్డిగారు శ్రీ భగవాన్ ప్రక్కన కూర్చున్నంత మాత్రానే గాఢమైన శాంతిని అనుభవించారు. బలరామరెడ్డిగారు ఈసారి మడు రోజులు మాత్రమే ఆశ్రమంలో ఉండి, అరవిందాశ్రమానికి తిరిగి వెళ్ళారు. తిరిగి అరవిందాశ్రమానికి వెళ్ళేటప్పుడు శ్రీ భగవానులే తన గురువు అనీ, అరుణాచలమే తన స్థానమని ప్రగాఢంగా విశ్వసించి వెళ్ళారు. అరవిందాశ్రమంలో సాధకులు ప్రతిరోజు గురువుగారితో వ్రాత ద్వారా అనుసంధానమై ఉండాలి. ప్రతి ఒక్కరూ తమ సందేహాలను, ఒక చిన్న కాగితముపై వ్రాసిపెట్టెలో ఉంచాలి. మర్నాటి ఉదయం శ్రీ అరవిందులు, వాటికి ప్రత్యుత్తరమిస్తారు. రెడ్డిగారు ఇలా వ్రాశారు, "గురువుగారు, మీరు మీ బోధ ఆత్మసాక్షాత్కారముతో మొదలు పెడతారు. శ్రీరమణ మహర్షి వారు సదా ఆత్మనిష్ఠులై ఉంటారు. శ్రీరమణాశ్రమానికి వెళ్ళి ఆత్మసాక్షాత్కారాన్ని పొందటానికి నాకు అనుమతినివ్వండి అన్నారు. వెంటనే అరవిందులు, "మీరిక్కడ వుండే ఆత్మసాక్షాత్కారాన్ని పొంద వచ్చును. దాని కొరకై మీరెక్కడకూ వెళ్ళనవసము లేదు అని జవాబు ఇచ్చారు.

ఈ ప్రత్యుత్తరంతో బలరామరెడ్డిగారు ఎంతో నిరుత్సాహ పడ్డారు. కానీ ఆయన అరవిందుల మాటను అంగీకరించే ఉద్దేశంలో లేరు. శ్రీరమణ మహర్షి సన్నిధి పట్ల వారు అంతగా



ఆకర్షితులయ్యారు. రెండవసారి వారు మళ్ళీ అరవిందులకు వ్రాత పూర్వకంగా తెలియజేశారు. అరవిందులు రెడ్డిగారిని హెచ్చరిస్తూ ఈ విధంగా బదులిచ్చారు: "మీరిప్పుడు వెళ్ళిపోతే, మీ గురించి మేము ఇంతవరకు చేసిన శ్రమ అంతా వృథా అయిపోతుంది. అందుచేత మీకు మేము అనుమతిని ఇవ్వము". నిరుత్సాహ పడకుండ మూడవసారి కూడ రెడ్డిగారు అరవిందులకు వ్రాశారు. ఈసారి ఎటువంటి సమాధానం వచ్చినా అరవిందాశ్రమాన్ని వదలి వెళ్ళాలని రెడ్డిగారు నిశ్చయించుకున్నారు. రెడ్డిగారి తపనను అర్థం చేసుకున్న అరవిందులు ఆయనకు అనుమతినిచ్చారు.

రెడ్డిగారు 1937లో శ్రీరమణ మహర్షి ఏబది ఏడవ జన్మదినాన శ్రీ రమణాశ్రమానికి చేరారు. సాధన చక్కగా కొనసాగిస్తూ, గురువు గారికి అంకితమై పోయి, సంపూర్ణ శరణాగతి చెందాలనే ఉద్దేశంతో ఆయన శ్రీ రమణాశ్రమానికి వచ్చారు. ఆ సమయంలో ఆశ్రమంలో ప్రత్యేకమైన గదులు లేకపోవడంతో, సాధన కొఱకు ఏకాంతం అవసరమై టౌన్‌లో శ్రీ రెడ్డిగారు ఒక గది అద్దెకు తీసుకున్నారు. ప్రతీరోజు శ్రీ భగవానులను కలుసుకోవటానికి ఉదయం 3 గంటలకు ఆశ్రమానికి వచ్చి, 11 గంటల వరకు ఉండి, అప్పుడు భోజనానికి వెళ్ళేవారు. మరల మధ్యాహ్నం మూడు గంటలకు వచ్చి తిరిగి రాత్రి 8 గంటల వరకు ఆశ్రమంలో ఉండేవారు. వాక్కు ద్వారానూ, కరుణాపూరితమైన పనుల ద్వారానూ, మౌనంద్వారా, ప్రేమను వ్యక్తపరుస్తూ, మహర్షి ఆయనకు మార్గం చూపేవారు.

శ్రీ భగవానుల చివరి రోజులలో రెడ్డిగారి వంటి భక్తులు ఎక్కువగా ఆయనను సందర్శించేవారు కాదు - ఇది కేవలం శ్రీ భగవానులను ఇబ్బంది పెట్టటం ఇష్టంలేక. 1950 ప్రారంభంలో మద్రాసు రాష్ట్రమంత్రులలో ఒకరైన సీతారామరెడ్డిగారు ఆశ్రమాన్ని దర్శించారు. ఆశ్రమ అధికారులు సీతారామరెడ్డి గారిని మరియు వారి మిత్రులైన బలరామరెడ్డి గారిని శ్రీ భగవానుల సందర్శనార్థం ఇప్పటి నిర్వాణగదిలో ఉన్న శ్రీ భగవాన్ వద్దకు తీసుకు వెళ్ళారు. శ్రీ భగవాన్ సన్నిధికి వెళ్లగానే బలరామరెడ్డిగారు ఆ గదిలో వింత కాంతి వ్యాపించినట్లు గమనించారు. శ్రీ భగవానుల పట్ల వారికి గల భక్తిభావం వల్ల వారు ఆ కాంతిని చూచారనుకున్నారు. బయటకు రాగానే సీతారామరెడ్డిగారు తనంతట తానే "మహర్షి గదిలో వ్యాపించి ఉన్న ఆ కాంతి ఏమిటి?" అని అడిగారు. శ్రీ కావ్యకంఠ గణపతిముని చత్వారింశత్, రెండవ శ్లోకంలో చెప్పిన పంక్తులు "సద్గుణరాశులకు నిలయము, మబ్బులచే కప్పబడిన భానుని తేజము వలె వారి తేజస్స్వరూపము దేహంచే కప్పబడినది" అన్నవి జ్ఞాపకం వచ్చాయి శ్రీ బలరామరెడ్డి గారికి.

*(మూలం: శ్రీరమణ పెరియపురాణం, శ్రీరమణ మహర్షితో ముఖాముఖి)*



# నేను చూసిన శ్రీ నిడిముసలి బలరామరెడ్డిగారు

- జి. శ్రీహరి రావు

శ్రీ భగవాన్‌కు బహు సన్నిహితులయిన భక్తులలో శ్రీ బలరామ రెడ్డిగారు ఒకరు. వారి జీవిత విశేషాలు, శ్రీరమణులతో వారు గడిపిన సమయాలలో వారు కన్నవీ, విన్నవీ, నేర్చుకున్నవీ వారి స్మృతులలో చక్కగా వివరించబడ్డాయి. 1983లో వారు హైదరాబాదు వచ్చి, శ్రీరమణకేంద్ర భక్తులకు తమ అనుగ్రహ వాక్యాలను ప్రసాదించినప్పటినుండీ, అనేకమంది భక్తులు వారి దర్శన భాగ్యమును పొంది, వారి సన్నిధి మహిమను అనుభవించ గలిగారు. వారిలో నేనొకడిని. శ్రీరమణాశ్రమంలో తిరుమలలో, తిరుపతిలో, బెంగుళూరులో, హైదరాబాదులో అనేక పర్యాయాలు వారిని కలుసుకొని వారి అసాధారణ వ్యక్తిత్వాన్ని దగ్గరగా గమనించ గలగడం, వారి ఆధ్యాత్మిక శక్తిని ప్రత్యక్షంగా చూడడం, వారి అమృత వాక్కులు వినడం భగవత్కృప వల్లనూ, పెద్దల అనుగ్రహం వల్లనూ సంభవించింది. ఈ సందర్శనానుభవాలలో నాకు ముఖ్యమని తోచినవీ, నా హృదయంలో నిలిచిపోయిన కొన్ని విశేషాలను యిక్కడ పొందుపరుస్తున్నాను. ప్రతి సన్నివేశం లో శ్రీ భగవాన్ స్పర్శ మనకు కలుగుతుందని నా విశ్వాసం.

నేను మొదటిసారిగా శ్రీ బలరామరెడ్డిగారిని శ్రీ రమణాశ్రమం లో వారి గదిలోనే చూశాను. నాతోబాటు మా నాన్నగారు శ్రీ జి.వి. రాజేశ్వరరావు గారు, మా పెద నాన్నగారు శ్రీ జి.వి. నరసింహా రావుగారు, మా నాన్నగారి బాల్యస్నేహితులూ గొప్ప సాధకులూ అయిన శ్రీ ఎస్. సాంబమూర్తిగారూ, నా భార్య శ్రీమతి ప్రభ

వున్నారు. అందరమూ వారి యెదుట ఒక వరుసలో కూర్చున్నాము. వరుస మొదటిలో నేనూ, వరుస చివరిలో శ్రీ సాంబమూర్తిగారూ వున్నాము. శ్రీ రెడ్డిగారు అందరినీ సాదరంగా, వాత్సల్యంతో చూస్తూ, చివరకు దృష్టిని శ్రీ సాంబమూర్తి గారిపై నిలిపారు. ఇద్దరి కళ్ళూ మూసుకున్నాయి. అలా నలభై నిమిషాలు గడిచాయి. ఇద్దరూ కళ్ళు తెరిచారు. తరువాత, కొంతసేపు ఏవో సంభాషణలు జరిగిన తరువాత, అందరమూ బయటకు వచ్చాము. శ్రీ సాంబమూర్తిగారు, మా నాన్నగారితో, "రాజా! నా సందేహాలన్నీ తీరిపోయాయి సుమా!" అన్నారు. మౌనంల బోధ అంటే ఏమిటో చూశాను.

శ్రీ రెడ్డిగారు యెప్పుడూ అంతర్ముఖంగా వుండేవారు. వారితో మాటలాడటానికిగానీ, వారి పాదాలను స్పృశించి నమస్కరించుకోవడానికి గానీ మొదట్లో చాలా బెరుకుగా వుండేది. ఒకసారి వారు తిరుపతి భీమాస్ డీలక్స్ హోటలులో వున్నప్పుడు, వారి దర్శనార్థము వెళ్ళాను. నాకు రైలుకు టయిమయినప్పుడు శలవు తీసుకొనడానికి లేచి నిలబడ్డాను. ఒక్కసారి వారి పాదాలు స్పృశించి నమస్కరించుకుంటే బాగుంటుందని తోచినా ధైర్యము చాల లేదు. ఆ ఆలోచన నాలో రాగానే, "శ్రీహరిరావు! ఆ ఆయింట్‌మెంటు కాస్త నా పాదాలకు రాసి వెళ్ళయ్యా" అన్నారు. ఆనందం కాక యేముంటుంది? తరువాతి రోజులలో వారికి కాళ్ళు పట్టడం లాంటి సేవ చేసే భాగ్యము కలిగింది నాకు. స్వామీ బ్రహ్మానంద విషయంలో మనం చదువుకునేటట్లు, మన అంతఃకరణ మొత్తమూ వారికి స్పష్టముగా కనిపిస్తుందనే విషయము మనకు తెలిసినా మన కెలాంటి బిడియముండదనే అనుభవం నాకు



కలిగింది. మన మంచీ, చెడూ, అంతా వారికి తెలుసు. అయినా సిగ్గుపడాల్సిందీ, భయపడాల్సిందీ ఏమీ లేదనిపించింది. శ్రీ రెడ్డి గారి లాంటి భక్తులు అంతర్యామిలు, పతితపావనులు.

"శ్రీ భగవాన్ వెళ్ళిపోతూ, నన్ను శ్రీ వేంకటేశ్వర స్వామికి అప్ప జెప్పి వెళ్ళారు", అనే వారు శ్రీ రెడ్డిగారు. వేసవిరోజులలో వారు తిరుమలలో గానీ, బెంగుళూరులో కానీ కాలం గడిపేవారు. ఒకసారి వారు తిరుమలలో వున్నప్పుడు నేను వారితో 3,4 రోజులుండటం సంభవించింది. రాత్రిపూట 11 గంటల వరకూ వారు యేవో మంచి విషయాలు చెబుతూ వుండేవారు. వారు విశ్రాంతికి లేచి వెళ్ళినప్పుడు, నేను వెళ్ళి శ్రీస్వామి ఏకాంత సేవకు టిక్కట్టు తీసుకొని దర్శనము చేసుకొని వస్తుండేవాడిని. ఆ రోజులలో దర్శనము తేలికగా దొరికేది. శ్రీ రెడ్డిగారు యిది గమనించి, "ఎందుకు? నిన్ను నేను దర్శనానికి తీసుకు వెడతాను!" అన్నారు. వారికి వెళ్ళాలనిపించినప్పుడు దర్శనము కలిగించే వసతి దేవాలయాధికారులు కల్పించారు. నన్ను తీసుకొని వెళ్ళి స్వామి సమక్షంలో యెంతోసేపు నిలుచుని తనివితీరా దర్శనం చేసుకునే భాగ్యం కల్పించారు శ్రీ బలరామరెడ్డిగారు. వారి కరుణ అలాంటిది.

తిరుమలలోనే యింకొకసారి, వారు శ్రీ చల్లపల్లి రాజా గారి తమ్ముడు గారి కాటేజీలో వున్నప్పుడు వారిని సందర్శించాను. ఒకరోజు ఉదయం వారు బయట వరాండాలో కూర్చొని మాటలాడుతుండగా, ముగ్గురు-నలుగురు యువకులు అక్కడికి వచ్చారు. వారిలో ఒకరిద్దరు సిగరెట్లు కాలుస్తున్నారు. శ్రీబలరామరెడ్డిగారికి పరిచయస్తులైన శ్రీ వెంకటరెడ్డిగారనే వారు కూడా అప్పుడు అక్కడ వున్నారు. ఆ యువకుల ధోరణి ఆయనకు

చాలా కోపం తెప్పించింది. శ్రీ బలరామరెడ్డిగారు చాలా ప్రశాంతంగా వున్నారు. వారి ముఖంలో చిరునవ్వు చెరగలేదు. ఒక కుర్రాడు "మీరు సన్యాసము యెందుకు తీసుకోలేదు?" అని ప్రశ్నించాడు. "నాకవసరం అనిపించలేదు, అని నవ్వుతోనే జవాబిచ్చారు శ్రీరెడ్డిగారు. ఆ ప్రశాంతత, నిగ్రహము సామాన్యులకు సాధ్యం కాదనిపించింది నాకు. శ్రీ భగవాన్ సమక్షంలో కూడా యిలాంటి సంఘటనలు జరగడం గురించి చదువుతుంటాము మనం.

ఇంకొక సందర్భంలో వారు తిరుపతిలో వున్నప్పుడు, వారిని చూడటానికి మధ్యవయస్కులైన దంపతులొచ్చారు. ఆ సమయంలో శ్రీ రెడ్డిగారు చెప్పిన చిన్నచిన్న పనులేవో చేస్తున్నాను నేను. వారితో కొద్దిసేపు మాట్లాడిన తరువాత శ్రీ రెడ్డిగారు రూము బయటకు వెళ్ళారు. ఆ యిల్లాలు నాతో యెంతో ప్రేమతో, "నాయనా! నీవు చాలా అదృష్టవంతుడవు. ఇలాంటి మహానుభావునకు సేవచేసే భాగ్యము కలగింది" అన్నారు. ఆ దంపతులు శలవు తీసుకున్న తరువాత, శ్రీ రెడ్డిగారు ఆ తల్లి గురించిన కొన్ని వివరాలు తెలియజేశారు. ఆమె బాగా చదువుకున్న వ్యక్తి అనీ, ఆధ్యాత్మిక విషయాల గురించి ప్రవచనాలిస్తుండే వారనీ, కుటుంబంలో జరిగిన ఒక దుర్ఘటన తరువాత ప్రవచనాలన్నీ మానివేశారని చెప్పారు. "ఎవరైనా కష్టములలో వుంటే, నీకు చేతనయితే వారి కష్టాలలో పాలుపంచుకో, అంతేకాని, వారి దగ్గర వేదాంతం మాటలాడవద్దు" అన్నారు. ఎచ్చమ్మగారు బహు దుఃఖంతో శ్రీ భగవాన్ దగ్గరకు వచ్చినప్పుడు, ఆ పరమాత్మ కన్నీరు కార్చడం గుర్తుకు వచ్చింది నాకు.



శ్రీ బలరామరెడ్డిగారు తెలియచేసిన విశేషాలలో వారు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతీ స్వాముల వారిని దర్శించుకున్న వృత్తాంతము ఒకటి. శ్రీ కంచిస్వాములు అరుణాచలం వచ్చినప్పుడు, ఒకరోజున ఆశ్రమం ముందునుండి యెచ్చటికో వెడుతూ వుంటే, ఆశ్రమంలో వున్న భక్తులందరూ వారిని దర్శించుకోడానికి పరుగు పరుగున వెళ్ళారట. శ్రీ బలరామరెడ్డిగారు మాత్రము శ్రీ భగవాన సన్నిధిని వదలి వెళ్ళలేదట. (రెండవవారు శ్రీ మురుగనారని చెప్పినట్లు గుర్తు) శ్రీ భగవాన్ దేహం చాలించిన తరువాత, ఒక వైష్ణవ స్వామిని కలుసుకోడానికి శ్రీరెడ్డిగారు కంచి వెళ్ళారట. ఊళ్ళో దిగిన తరువాత, ఒక రిక్షా అబ్బాయిని తను వెళ్ళవలసిన చోటుకు తీసుకువెడతావా అని అడిగినప్పుడు, అతను, "శంకరమఠానికా?" అని ప్రశ్నించాడట. 'కాదు' అని శ్రీరెడ్డిగారు అతనిని సవరించినా, అతను మళ్ళీ అదే ప్రశ్న వేశాడట. ఇలా మూడుసార్లు జరిగిన పిమ్మట శ్రీ రెడ్డిగారు 'దీనికేదో కారణముంటుంది' అని భావించి, 'సరే', అని కాంచీ శంకరమఠానికి వెళ్ళారట. వీరు వెళ్ళేసరికి స్వామి ఒక్కరే వున్నారట. ఇద్దరు దాదాపు రెండు గంటలు సంభాషించుకున్నారట సంస్కృతంలో. మధ్యలో భోరున వర్షం కురిసినా యిద్దరూ కదలకుండా మాటలాడుతూనే వుండిపోయారట. చివరకు సంభాషణ ముగిసి, నిశ్శబ్దం ఆవహించిన తరువాత శ్రీ రెడ్డిగారు శలవు తీసుకొని బయటకు వచ్చారట. "ఆ రోజున శ్రీ భగవాన్‌ను వదిలి వెళ్ళనందుకు వారిచ్చిన బహుమానమేమో యిది" అన్నారు శ్రీ బలరామరెడ్డిగారు.

తనను తాను, "శ్రీ భగవాన్ బిడ్డగా వర్ణించుకునే వారు శ్రీ రెడ్డిగారు. ఆశ్రమ నివాసానికి ముందూ, తరువాత కూడా అనేక

సందర్భాలలో శ్రీ భగవాన్ రక్షను వారు అనుభవించారు. తిరుపతిలో వున్నప్పుడు ఒకసారి వారికి మాట పోయింది. బెంగుళూరు NIMHANS లో చికిత్స కోసం వెళ్ళినప్పుడు, వారు పరీక్షలు చేసి, మెదడులో 'ట్యూమర్' వుందని నిర్ధారించి శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారట. శ్రీరెడ్డిగారిని చూసి రమ్మని నాన్నగారు పంపించగా, నేను బెంగుళూరు వెళ్ళాను. స్కాన్ కాపీలన్నీ నాకు చూపించి, చిన్నపిల్లవాడిలాగా డాక్టరు గారి దగ్గరకు వెళ్ళేటప్పుడు నన్ను కూడా రమ్మన్నారు. దురదృష్టవశాత్తూ, ఆఫీసు పనుల వలన నేను హైదరాబాదు రావలసి వచ్చింది. శస్త్ర చికిత్సకు ముందు యింకొక స్కాన్ తీయగా 'ట్యూమర్' చిహ్నాలే లేవట. శ్రీ భగవాన్ ఎందరో భక్తులను యిలా కాపాడటం గురించి మనం తెలుసుకుంటాము.

శ్రీ మాధవపెద్ది రామకృష్ణగారు శ్రీ బలరామరెడ్డిగారికి బహు సన్నిహితులు. ఒకసారి శ్రీరెడ్డిగారి ఆధ్యాత్మిక శక్తిని గురించి వివరిస్తూ, ఒక విశేషం తెలియజేశారు. శ్రీ భగవాన్ దేహం చాలించిన తరువాత శ్రీ రెడ్డిగారు మద్రాసు వై.ఎమ్.సి.ఏ.లో కొంతకాలం వున్నారట. ఆ సమయంలో శ్రీరామకృష్ణ గారు వారిని చూడటానికి వెళ్ళినప్పుడు, తనను పక్కన కూర్చొనబెట్టుకొని శ్రీరెడ్డి గారు ధ్యానంలో మునిగిపోయారట. శ్రీరామకృష్ణగారు కూడా ధ్యానం చేసుకుంటూ, కొంతసేపటికి కళ్ళు తెరిచి చూడగా శ్రీరెడ్డి గారి వెనుక ఒక అగ్ని వలయం తిరుగుతూ కనిపించిందట. శ్రీ రెడ్డిగారు సామాన్యులు కాదు అని చెబుతుండేవారు శ్రీరామకృష్ణ గారు.

శ్రీ బలరామరెడ్డి గారు బెంగుళూరులో వున్నప్పుడు, నేను వెడుతున్నానని తెలిసి, నాకు బాగా తెలిసినాయన ఒకరు, శ్రీ రెడ్డిగారిని



కలిసినప్పుడు ఒక విషయం తెలియజేసి వారి సహాయం కోరమని అడిగారు. ఆయనకు బాగా సన్నిహితుడయిన ఒకాయన, విదేశాలలో ఒక తప్పు చేయడంవల్ల, కారాగార వాసుడయ్యాడట. ఆ తప్పుకు ఆ దేశంలో మరణశిక్ష గానీ, యావజ్జీవ కారాగార శిక్ష గానీ తప్ప వేరు శిక్ష లేదట. ఈ సంగతి శ్రీ రెడ్డిగారికి తెలియ చేసి వారి దీవెనలు కోరుతున్నారని తెలియచేయగా, "ఫరవాలేదు" అని శలవిచ్చారు వారు. అలాగే ఆ నిందితుడిని విడుదల చేసి భారతదేశం పంపించేశారు. మహాత్ముల రక్ష అభేద్యము.

మా నాన్నగారి ఆరోగ్యం 1986-90 సంవత్సరాలలో బాగా క్షీణించింది. తరచూ హాస్పిటలుకు తీసుకు వెళ్ళడం, తీసుకు రావడం జరిగేది. ఒకసారి పరిస్థితి బాగా విషమించినప్పుడు, వైద్యులు, "లాభం లేదు, తెలియపరచవలసిన వారికి కబుర్లు చేయండి," అని చెప్పారు. మా నాన్నగారికి స్పృహ లేదు. కోమాలో వున్నట్లున్నారు. నేను శ్రీబలరామరెడ్డిగారికి నాన్నగారిని కాపాడాలని వుత్తరం వ్రాశాను. ఆ వుత్తరం శ్రీ రెడ్డిగారికి చేరగానే, మా నాన్నగారికి స్పృహ వచ్చింది, కోలుకున్నారు. శ్రీ భగవాన్ భక్తులు అనేకమంది ఇలా తమను శ్రీ భగవాన్ రక్షించిన సన్నివేశాలు మనకు తెలియజేశారు.

నేను 1990 మార్చి 5వ తారీఖున శ్రీ బలరామరెడ్డిగారిని శ్రీరమణాశ్రమంలో కలుసుకోవడం జరిగింది. అప్పటికే నాన్నగారి ఆరోగ్యం బాగా క్షీణించింది. మంచానికే పరిమితమయినట్లున్నారు. నాన్నగారి ఆరోగ్యం గురించి తెలుసుకొని, "ఈ నెల గడిస్తే యింకా పదేళ్ళు బ్రతుకుతారు మీ నాన్నగారు", అన్నారు శ్రీ రెడ్డిగారు. సరిగ్గా మార్చి 31న దేహం చాలించారు మా నాన్నగారు. దైవ నిర్ణయం అలా వున్నది కాబోలు.

"జీవనాధారం కోసం పనిచేయనవసరం లేని వారు భగవంతునికి అంత దగ్గరగా వుంటారు," అనేవారు శ్రీబలరామరెడ్డిగారు. వారి ఆంతర్యం యేమిటంటే, మనిషి జీవితంలో తిండికోసము, బట్టకోసము, నీడ కోసము కష్టపడటంలో 70 శాతము జీవితము గడిచి పోతుంది. అలాంటి అవసరము లేనివారు, తమ సమయాన్ని పూర్తిగా భగవదాన్వేషణకు వినియోగించుకుని ధన్యులవ్వవచ్చని వారి ఉద్దేశ్యము. ఆయనది అలాంటి ధన్య జీవితము. చిన్నతనము నుండీ, ఐహిక జీవితమును త్యజించి, సత్యాన్వేషణకు తన జీవితాన్ని వెచ్చించిన మహాత్ములు వారు. దేశంలో వారు దర్శించని మహాత్ములు లేరు. వారు చదవని ఆధ్యాత్మిక గ్రంథములేదు. ఆనందమాయీ, సాధూ వాస్వానీ, స్వామీ రామదాసు, మాతా కృష్ణా బాయి, శ్రీ అరబిందో, జిల్లెల్లమూడి అమ్మగారు, పిచ్చమ్మ గారు, పెద్దమ్మగారు, కృష్ణ ప్రేమ్ మొదలైన మహానుభావులందరితో వారికి దగ్గర సంబంధాలుండేవి. శ్రీ రెడ్డిగారి తపఃశక్తి, ఆధ్యాత్మిక ఔన్నత్యమూ బయటకు కన్పించేవి కావు. నివురుకప్పిన నిప్పులాగా జీవించే వారు శ్రీ రెడ్డిగారు.

శ్రీ రెడ్డిగారు హైదరాబాదు రమణకేంద్రాన్ని ఒక విశిష్టమయిన కేంద్రంగా పేర్కొనే వారు. తమ హైదరాబాదు పర్యటనలో భాగంగా, ఆంధ్రమహిళాసభ మహిళా కళాశాలలోని గాంధీ స్మారక మందిరంలో రమణకేంద్ర సత్సంగాలకు విచ్చేశారు. అచ్చట కేంద్రం ఆదివారం కొన్ని నిర్ణీత సమయాలలోనే సమావేశమవటానికి అనుమతి వున్నందున, కేంద్రానికి తనదంటూ ఒక భవనం వుండాలని మరీమరి చెప్పేవారు. భక్తులు తమకు వీలైనప్పుడు



వచ్చి శ్రీ భగవాన్ వద్ద కూర్చొని ధ్యానం చేసుకోగలగాలంటే మీ భవనం మీకుండాలి. దీనివలన మీకు కొన్ని బేధాభిప్రాయాలు కూడా రావచ్చు. అయినా ఆ భవనం మీకు అవసరమని నాతోనూ, యితరులతోను అనేవారు శ్రీ రెడ్డిగారు. వారి సంకల్పబలంతోనే మనకు శ్రీరమణకేంద్ర భవనం యేర్పడిందని నా భావన.

వారు హైదరాబాదు వచ్చినప్పుడు, ఆబిడ్స్ తాజమహల్ హోటల్‌లో ఏడువారాలున్నారు. కేంద్రం భక్తులు అక్కడకు వెళ్ళి వారి దర్శనం చేసుకొని అక్కడి సత్సంగాలు ఆస్వాదించేవారు. డా. కె.ఎస్.గారు కూడా తరచుగా వారిని కలవడానికి వెళ్ళేవారు. నేనూ చాలాసార్లు వెళ్ళి వారి వద్ద కాలం గడిపే వాడిని. రాత పనులలో వారి డిక్టేషన్లు తీసుకొనేవాడిని. ఆ సమయంలోనే శ్రీ గణేశన్ గారి సంకలనం (మధురక్షణాలు) లో ప్రచురణార్థము శ్రీబలరామరెడ్డిగారు శ్రీ భగవాన్‌తో తమ స్మృతులను నాకు డిక్టేషన్ యిచ్చారు. ఆ స్మృతులలో 'కన్యాకుమారి ఇసుకల' గురించి డిక్టేషన్ యిస్తూ, శ్రీ భగవాన్ తనకు సూచనాప్రాయంగా ఆ యిసుకలు తెచ్చేపని తనకు అప్పచెప్పారనీ, సద్గురువులు యేదైనా పని చెబితే అది అనుగ్రహ సూచనే అని తను భావించాననీ నాతో అన్నారు. ఆ డిక్టేషన్ వారు చెప్పడం కూడా అనుగ్రహమే అనుకున్నాను.

'శ్రీరమణజ్యోతి' మేనేజింగ్ ఎడిటరుగా ఆ రోజులలో శ్రీ ఆర్.జె. దోషీగారు వ్యవహరించేవారు. శ్రీ బలరామరెడ్డిగారు హైదరాబాదులో వున్నంత కాలమూ ఆయన తన కారు తీసుకు వెళ్ళి శ్రీ రెడ్డిగారి డ్రైవరుగా సేవ చేశారు. ఒకరోజు తాజ్‌మహల్‌లో నేనున్న సమయంలోనే భీమవరం నుండీ శ్రీ సుబ్బరాజు గారనే

భక్తులు శ్రీ బలరామరెడ్డిగారిని చూడటానికి వచ్చారు. కొద్దిసేపు సంభాషించిన తరువాత, శలవు తీసుకొనేముందు 'శ్రీరమణ జ్యోతి'కి విరాళంగా నాలుగువందల రూపాయలు నాకివ్వ బోయారు. నేను తీసుకోబోతుండగా, శ్రీ రెడ్డిగారు నన్ను వారించి, ఆ డబ్బును పక్కన పెట్టించారు. కొద్దిసేపటి తరువాత శ్రీ దోషీ గారు లోపలికి వచ్చారు. శ్రీబలరామరెడ్డిగారు రాజుగారిని పరిచయం చేస్తూ, జరిగిన విషయం చెప్పారు. "శ్రీరమణజ్యోతి"కి మేము విరాళాలు తీసుకోము. మీరు యివ్వదలుచుకుంటే, కొంత మంది పేరున సంవత్సర చందాగా యివ్వండి" అన్నారు శ్రీ దోషీ గారు. "అదీ! శ్రీరమణకేంద్రం, హైదరాబాదు" అన్నారు శ్రీరెడ్డి గారు సంతోషంతో! ఆ తరువాత శ్రీరాజుగారు యింకొక రెండు వందలు జతచేసి చందాదారుల పట్టిక దోషీగారికి యిచ్చి వెళ్ళిపోయారు.

బెంగుళూరు 'భారతీయ విద్యాభవన్'కు శ్రీ బలరామరెడ్డిగారు ఒక ఎండోమెంటె కల్పించారు. శ్రీ భగవాన్ గురించి ప్రతి సంవత్సరం, మూడు ఉపన్యాసాలు యేర్పాటు చేయడం ఆ ఎండోమెంటు లక్ష్యం. ఒకసారి 'శ్రీ భగవాన్ - ఆదిశంకరులు' అనే శీర్షికతో మైసూరుకు చెందిన ప్రొఫెసర్ కృష్ణమూర్తిగారు మూడు ఉపన్యాసాలిచ్చారు. ఆ సందర్భంగా, భగవాన్‌నూ, శంకరులనూ పోల్చ సాధ్యముకాదన్నట్లు శ్రీమద్రాయణ శ్లోకం.

"గగనం గగనాకారం సాగరం సాగరోపమహ" అని వుల్లేఖించారు. (ఆ సమయంలో నేను బెంగుళూరులో వుండటం వల్ల ఉపన్యాసాలకు శ్రీ రెడ్డిగారితో నేను కూడా వెళ్ళాను) ఉపన్యాసాలు సమాప్తి అయిన తరువాత, ఒక రమణభక్తులు - చాలా పెద్ద



వారు, ఉపన్యాసాలు అంత గొప్పగా లేవని పెదవి విరిచారు. శ్రీ బలరామరెడ్డిగారికి చాలా కోపం వచ్చింది. (ఆయనను కోపంగా చూడటం నాకదే మొదటిసారి)

'గగనం గగనాకారం సాగరం సాగరోపమహ' అన్న ఒక్క వాక్యం చాలు ఎండోమెటు మొత్తానికీ, అని గట్టిగా అన్నారు. ఆ సామ్యం ఆయనకు అంతగా నచ్చింది. భాష, భావముల పట్ల వారి కంత మక్కువ.

శ్రీ బలరామరెడ్డిగారు ఒక సింహములాగా వుండేవారు. వారి శరీరఛాయ నల్లనిది. అయినా ముఖంలో తేజస్సు కనిపించేవి. వారి చిరునవ్వు బహుమధరముగా వుండేది. "కర్మసు కౌశలం యోగః" అనునది వారిలో ప్రత్యక్షంగా చూడకలిగే వారలము. నేను వారితో వున్నప్పుడు, మామిడిపండ్ల తోలు వారు కత్తితో తీసే తీరు చూసి ఆశ్చర్యపోయేవాడిని, ఎంతో నాజుకుగా పండు భాగము యేమాత్రం వృథా కాకుండా తీసేవారు. దోమలు రాకుండా వాడే 'టార్టాయిస్' మందు చుట్టలను, విరగకుండా బహు నేర్పుతో విడదీశేవారు. నేను తీస్తానంటే 'నీకు చేతకాదులే' అని చేయనిచ్చేవారుకాదు.

వారి సర్వజ్ఞత అసాధారణము. ఏదైనా తేవడానికి నన్ను బజారు పంపినప్పుడు, ఏదో యెక్కడ కొనాలో, యెంతకు కొనాలో వివరంగా చెప్పి పంపేవారు. ఆశ్రమంలో వారి గదినిండా పుస్తకాలు పరిచి వుండేవి. కానీ ఆయనకు ఏ పుస్తకము యెక్కడవున్నదో, యే పుస్తకంలో యే విషయం యే పేజిలో వున్నదో వారికి క్షుణ్ణంగా తెలిసేది. ఆ ప్రజ్ఞ చూసి నివ్వెరపోయేవాడిని నేను.

నేను ఆఖరుసారిగా వారి వద్దకు 1995 మే 5వ తారీఖున వెళ్ళాను. వారప్పుడు బెంగుళూరు వుడ్‌లాండ్స్ హోటలులో వున్నారు. ఆరోగ్యము చాలా క్షీణించి పోయింది. సింహము లాంటి మనిషి మంచానికి అతుక్కొని ఉన్నారు. వారి సోదరి శ్రీమతి సుశీలమ్మగారు వారి బాగోగులు చూసుకుంటున్నారు. నన్ను చూడగానే, 'రా నాయనా! నీవు వచ్చి పక్కన కూర్చో' అని చెప్పి తను బయటకు వెళ్ళారు. శ్రీ రెడ్డిగారు కొద్ది రోజులుగా ఆహార మేదీ తీసుకోవడం మానివేశారని చెప్పారు సుశీలమ్మగారు. నన్ను చూడగానే శ్రీ రెడ్డిగారు గద్గద స్వరంతో, కన్నీరు కారుస్తూ "నీ విప్పుడు రావడం నాకెంతో సంతోషంగా వున్నది!" (Your coming now gives me supreme joy!) అని ఆంగ్లంలో అన్నారు. వారి ముఖంలో కన్నీరు చూడటం నాకు అదే మొదటిసారి. నాకు గుండెలు పిండినట్లయినది. సుశీలమ్మగారు నాచేతికి ఒక గ్లాసు మజ్జిగయిచ్చి తాగుతారేమో చూడమని అడిగారు. శ్రీరెడ్డిగారు ఆ గ్లాసు మజ్జిగ తాగారు. ఆ రోజంతా నేను వారి పక్కనే వున్నాను. రెండవ గ్లాసు మజ్జిగ కూడా కొద్ది సేపు తరువాత తీసుకున్నారు శ్రీ రెడ్డిగారు. అది ఎంతో తృప్తి నిచ్చింది. ఆ స్థితిలోనే శ్రీ బలరామరెడ్డిగారు చాలా సేపు మాట్లాడారు. "ఫలానా బలరామరెడ్డి యీ ప్రపంచానికి వచ్చాడనీ, లోకం వదలి వెళ్ళాడనీ, యీ ప్రపంచానికి తెలియనవసరం లేదు" అన్నారు నాతో ఆంగ్లంలో (The world need not know that a certain Balarama Reddy came into the world and left it) అన్నారు వారి వినయం అట్టిది.

నేను గమనించలేదుకానీ, శ్రీ కృత్తివాసన్ నాతో అన్నారు:



హైదరాబాదు శ్రీరమణకేంద్రానికి వారు మొదటిసారి వచ్చినప్పుడు, కూర్చొనేముందు భక్తులందరికీ వారు సాష్టాంగ నమస్కారం చేశారట. శ్రీ బలరామరెడ్డిగారు నిజంగా శ్రీ భగవాన్‌కు ముద్దుబిడ్డే!

నేనెంతో అల్పుడనూ, అనర్హుడన అయినప్పటికీ శ్రీ బలరామ రెడ్డిగారు నా పట్లా, మా కుటుంబము పట్లా యెంతో ప్రేమా, కరుణా కురిపించారు. డా. కె.ఎస్.గారు అన్న 'Grace is what you get even if you do not deserve it' (కరుణ అంటే నీకు అర్హత లేకపోయినా పొందగలిగేది), అన్నది నా పట్ల చాలా సత్యము. శ్రీ రెడ్డిగారు పూజ్యులు, మహాశక్తిమంతులు, ప్రాతః స్మరణీయులు. వారికి నమస్సుమాంజలి ఘటిస్తున్నాను.

## శ్రీ బలరామరెడ్డిగారి స్మృతులు

శ్రీ ఎ.వి. రమణయ్య

పూర్వజన్మ సుకృతము వల్ల కాబోలు డా. కె.ఎస్. గారూ, శ్రీ బలరామ రెడ్డిగార్ల వంటి మహాత్ముల సందర్శన భాగ్యమూ, ఉడతా భక్తిగా వారికి సేవ చేయు భాగ్యమూ నాకు కలిగినవి.

శ్రీ బలరామరెడ్డిగారు హైదరాబాదు వచ్చినప్పుడూ, ఆ తరువాత తిరుపతిలోనూ, శ్రీరమణాశ్రమంలోనూ వారి వద్ద చాలా రోజులుండి ఎన్నో విషయాలు చూసి నేర్చుకొనే అవకాశము నాకు లభించినది. ఆధ్యాత్మిక పరమయిన విషయములేకాక, లౌకికమయిన విషయములు కూడా వారు బహు సున్నితంగా సూచించి బోధించేవారు.

బాల్యము నుండీ ఆధ్యాత్మిక చింతనలోనే కాలము గడిపిన శ్రీ రెడ్డిగారు, వారి స్వగృహములో కూడా ఆశ్రమ జీవనము చేసినట్లు మనకు కనిపించును. ఇంటికి దూరముగా ఒక కుటీరము నిర్మించుకొని నిరంతరమూ ధ్యానమూ, పుస్తక పఠనములతోనే వారి సమయము నియంత్రించుకొనువారు.

ఆశ్రమంలోనూ, వారి స్వగృహములోనూ శ్రీరెడ్డిగారు అమూల్యమయిన గ్రంథములను సేకరించి పెట్టుకున్నారు. వారి సూచన మేరకు చాలా పుస్తకములు శ్రీరమణకేంద్రమునకు వారి సోదరి బహుకరించడమే కాక, కేంద్రములో గ్రంథాలయ నిర్మాణము కొరకు వారు 50,000 రూపాయలు విరాళముగా యిచ్చిరి. ఎప్పుడూ బయటకు వెళ్ళినట్లు కనిపించని శ్రీరెడ్డిగారి సర్వజ్ఞత బహు అబ్బురముగా నుండెడిది. ఏ వస్తువులు యెక్కడ దొరుకునో, ఎక్కడ నాణ్యముగా వుండునో వారు చెప్పుట విని నేను ఆశ్చర్యపోయేవాడిని.

భారత స్వాతంత్ర్య సమరములో పాల్గొని కారాగారవాసమను భవించిన శ్రీ రెడ్డిగారికి రాష్ట్ర ప్రభుత్వము నెలసరిగా కొంత పారితోషికము యేర్పాటు చేసినది... ఆ సందర్భముగా వారికి కొంత సేవ చేయు అవకాశము నాకు కలిగినది. ప్రభుత్వ సంస్థలతో మెలగవలసిన తీరును వారు బహు సూక్ష్మముగా నాకు సూచించెడివారు. నిజ ప్రపంచపు తీరుతెన్నులు వారికి క్షుణ్ణముగా తెలుసును. దేనినీ వారు నిందించెడి వారు కాదు. వారికి బ్రహ్మమూ, తెలుసును మాయా తెలుసును.

శ్రీ బలరామరెడ్డిగారు హైదరాబాదు శ్రీరమణకేంద్రము పట్లా కేంద్రము భక్తుల పట్లా చాలా ప్రేమా, వాత్సల్యమూ చూపించెడి



వారు. మన కేంద్ర భవనము నిర్మాణములో వున్నప్పుడు, తనకు పైన ఒక గది నిర్మించిన, హైదరాబాదు వచ్చినప్పుడు అక్కడ వుండెదననీ, వలసిన పైకము తానిచ్చెదననీ తెలియచేశారు. అందరకూ యెంతో సంతోషము కలిగినది. కానీ శ్రీ భగవాన్ సంకల్పము వేరుగా వుండినది.

1994 చివరి రోజులలో తనకు ఆరోగ్యము సరిగా లేనందున సహాయము కొరకు నన్ను పిలిపించమని శ్రీరమణాశ్రమం ప్రెసిడెంటుగారి ద్వారా కబురు చేశారు. నేను వెంటనే వెళ్ళి కొద్ది రోజులుండి వారికి సేవ చేసుకోగలిగాను. ఆరోగ్యము కొంచెము సర్దుకున్న సమయంలో నేను హైదరాబాదు తిరిగి వచ్చాను. కానీ కొద్ది రోజులలోనే వారి ఆరోగ్యము క్షీణించడమూ, వారిని బెంగుళూరు తీసుకు వెళ్ళడమూ జరిగినవి. అక్కడనే వారు దేహము చాలించారు.

శ్రీ రెడ్డిగారి అంత్యక్రియలు వారి స్వగ్రామము ఊటుకూరులో జరిగినవి. ఆయన అంతిమయాత్రలో పాల్గొనే అవకాశము శ్రీ కేశవరెడ్డిగారు కల్పించడము నా అదృష్టముగా భావిస్తాను.

'గమ్యమూ రమణుడే, మార్గమూ రమణుడే' అని శ్రీ బలరామరెడ్డిగారు వ్రాసిన వ్యాసములో వారు వర్ణించిన మూడు రకముల భక్తులలో, మూడవ తరగతికి చెందిన మహనీయులు శ్రీ రెడ్డిగారు. అప్పటికే పరిపక్వత చెంది, శ్రీరమణుల పాదముల నాశ్రయించి పరిపూర్ణత సాధించిన భక్తశిఖామణులు. వారిలో శ్రీ భగవాన్‌ను చూసుకొను భాగ్యము కలుగుట నావంటి వారల అదృష్టము.

# శ్రీ భగవాన్ సేవలో

'In the service of Sri Bhagavan' అను శ్రీ రమణాశ్రమం వారి ఆంగ్ల ప్రచురణకు 'శ్రీ భగవాన్ సేవలో' తెలుగు అనువాదము. అనువాదకర్త శ్రీ జి. శ్రీహరిరావు. ఈ అనువాదమును కూడా శ్రీరమణాశ్రమం వారు ప్రచురించారు.

శ్రీ రమణాశ్రమ చరిత్ర యింతవరకూ ప్రచురింపబడలేదు. కానీ, యీ పుస్తకం ద్వారా ఆశ్రమచరిత్ర గురించిన విశేషాలు చాలా తెలుసుకొనవచ్చు.

శ్రీరమణాశ్రమ పురోభివృద్ధికి శ్రీ నిరంజనానందులవారు (శ్రీ భగవాన్ తమ్ముడు శ్రీ నాగ సుందరంగారు) శ్రీరమణానంద సరస్వతుల వారు (శ్రీ నాగసుందరం గారి పుత్రుడు శ్రీ టి.ఎన్. వెంకటరామన్‌గారు), వారి కుటుంబ సభ్యులు, పడిన శ్రమ, యెదుర్కొన్న కష్టాలూ యీ రచనల్లో స్పష్టమౌతాయి.

శ్రీరమణాశ్రమం మన దేశములో బహు విశిష్టమయిన ఆశ్రమం. ఈ ఆశ్రమం గురించి, అక్కడి ప్రశాంతత, పవిత్రత గురించి వింటామేకాని, యెన్నడూ యెటువంటి ఆక్షేపణా మనం వినలేదు. ఆశ్రమానికి శ్రీ భగవాన్ వేసిన పవిత్ర పునాదులే దీనికి ముఖ్య కారణం. శ్రీ నిరంజనానందుల వారికీ, వారి కుమారునికీ, వారి కోడలికీ శ్రీ భగవాన్ చేసిన ఉపదేశమే యీ పునాదుల మూల బీజము. 'ఇతరులకు చెందినదేదీ మనం ఆశించరాదు'- ఈ ఆదేశము లేక ఉపదేశము మూడు సందర్భములలో యివ్వబడింది. తనను మొదటిసారి కలిసిన తన తమ్ముడు కలకండను శ్రీ భగవాన్ ప్రసాదముగా తీసుకొని వెళ్ళ కోరినప్పుడూ, బాలవెంకటరామన్ నొండి (కుంటి కోతి) కోసం కిటికీలో పెట్ట బడిన తినుపదార్థములు తీసుకొనే ప్రయత్నం చేసినప్పుడూ;



శ్రీమతి నాగలక్ష్మిగారు ఒక ఆశ్రమ సందర్శకురాలు, ధరించిన చీరెను మెచ్చుకొంటే ఆమె తండ్రి నాగలక్ష్మిగారి కోసం బహుమతిగా రెండు చీరెలు పంపినప్పుడూ!

ఈ విశేషాలే కాక, ఎన్నో వేరే సంగతులు కూడా తెలుగు పాఠకులకు ఆసక్తికరంగా వుంటాయని తలచి, యీ పుస్తకాన్ని 'శ్రీరమణజ్యోతి'లో ధారావాహికంగా ప్రచురిస్తున్నాము.

ఈ పుస్తకం యొక్క 'తొలిపలుకు'లో శ్రీ బలరామరెడ్డిగారు 'నా స్మృతులు' అన్న గ్రంథంలో శ్రీ భగవాన్, ఆయన కుటుంబం గురించి తెలిపిన విషయాలు చేర్చబడివున్నాయి. వాటిని కూడ ఇందులో పొందుపరచడం జరిగింది.

## శ్రీ భగవాన్, ఆయన కుటుంబము

- శ్రీ బలరామరెడ్డి గారు

తమ తల్లి సమాధిపై నిర్మింపబడిన దేవాలయం విషయంలో శ్రీ భగవాన్ విశేష శ్రద్ధ చూపారు. ఈ గుడి కట్టాలనే సంకల్పమూ, దాని నిర్మాణబాధ్యతా పూర్తిగా వారి తమ్ముడిదే అని కొందరను కోవచ్చు. ఆ సమయంలో అక్కడే వున్న మాలాంటి వారి అభి ప్రాయం మట్టుకు అందుకు భిన్నం. ఆలయ నిర్మాణంలో ఎటు వంటి సందేహం వచ్చినా, స్థపతిని శ్రీభగవాన్ దగ్గరకు పంపేవారు సర్వాధికారి. ఆయన చెప్పింది శ్రీ భగవాన్ ఎంతో శ్రద్ధగా విని, తగు సలహా యిచ్చి పంపేవారు. ఆలయ నిర్మాణం గురించి ప్రతీ విషయంలోనూ శ్రీ భగవాన్ చొరవ చూపించేవారు.

మనము తరచూ చూసే సాధువులూ స్వాములూ వేరు, శ్రీ భగవాన్ వంటి మహర్షులు వేరు. కుటుంబసభ్యులను తమ చుట్టూ వుంచుకొని కూడా వారెంతో తటస్థంగా వుండ గలిగేవారు.

శ్రీ భగవాన్ తల్లిగారినే తీసుకుందాం. 1914లో శ్రీ భగవాన్ కొండ పై వుండగా, ఆమె దేహస్థితి బహు ప్రమాదకరంగా పరిణమించి నపుడు, ఆమె ప్రాణం కాపాడమని అరుణాచలేశ్వరుని ప్రార్థిస్తూ వారు నాలుగు పద్యాలు రాసారు.

శ్రీరాముల వారు కూడా తన వారందరి క్షేమం చూసుకునే వారు. రాముడైనా, శ్రీ భగవాన్ అయినా, మాయా బంధంలో చిక్కుకోకుండా తమ వారిని చూసుకోగలరు. మాయకు అతీతు లైనా, మానవ జాతిని కాపాడగలరు వారు.

తన తల్లికి పునర్జన్మ లేకుండా ముక్తిని ప్రసాదించాలన్నది శ్రీ భగవాన్ సంకల్పం. తన కుమారుని పట్ల ఆ తల్లికున్న నమ్మకం అచంచలం. తనను రక్షింపగల వాడు తన కుమారుడేనని ఆమె గాడ విశ్వాసము. వృద్ధాప్యంలో ఒక్క రోజు కూడా కొడుకుని విడిచి వుండటానికి ఆమె ఒప్పుకోలేదు. చివరి ఘడియల్లో, తల్లి పక్కనే కూర్చుని ఆమెకు మోక్ష ప్రాప్తి కలిగించారు శ్రీ భగవాన్. ఇది ఎంత సహజంగా వున్నదో చూడండి. ఆయన వద్దకు తన తల్లి వచ్చింది. తమ్ముడు వచ్చాడు. చెల్లెలు వస్తూ వుండేది. కొన్ని సందర్భాల్లో, తన తమ్ముని కొడుకు వెంకటరామన్ చిన్నవాడిగా వున్నపుడు అతని యోగక్షేమాలు కూడా, శ్రీ భగవాన్ చూసుకొనే వారు. ఆ అబ్బాయి అవసరాలు, ప్రపంచంలో యితర పెదనాన్నలు చూసినట్లుగానే, శ్రీ భగవాన్ చూసుకునేవారు. కానీ తానొక అన్నని గానీ, కొడుకునని గానీ, పెదనాన్ననని గానీ ఆయన అనుకున్నారా? ఎన్నటికీ లేదు. తాను కేవలం అభిన్న మయిన ఆత్మ స్వరూపుడునని ఆయనకు తెలుసు.



ఒకసారి బుద్ధుడికి కూడా యిలాంటి పరిస్థితే ఎదురైంది. అతడు చిన్న వయస్సులో వున్నపుడే, తల్లిని పోగొట్టుకున్నాడు. పినతల్లి తనని పెంచింది. బుద్ధుని తండ్రినే పెళ్ళిచేసుకొని ఆయనకు సవతి తల్లి కూడా అయింది. బుద్ధునికి జ్ఞానోదయ మైన తరువాత, ఆమె బౌద్ధ సంఘంలో చేర గోరింది. మొదట ఒక స్త్రీ సంఘంలో చేరటానికి బుద్ధుడు నిరాకరించాడు. అతనికి సన్నిహితుడైన శిష్యుడు ఆనందుడాయనను సమీపించి, 'నిన్నెంతో ప్రేమతో పెంచి పెద్దచేసిన ఆమె కోర్కెనెలా నీవు కాదనగలవు' అని ప్రశ్నించాడు. అప్పుడు బుద్ధుడు మెత్తబడి ఆమెనే కాక మరి కొందరు కుటుంబ సభ్యులను కూడా సంఘంలో స్వీకరించాడు.

తనతల్లి పట్ల శ్రీ భగవానుకు ప్రత్యేకమైన అభిమానం వున్న దనటంలో సందేహం లేదు. అలాగే తన తమ్ముని కుటుంబ వ్యవహారాల్లో ఆయన శ్రద్ధ చూపించేవారు. తాను కుటుంబ సభ్యులతో సంబంధం లేని సన్యాసినని శ్రీ భగవాన్ యెన్నడూ చెప్పలేదు. ఇతరుల పట్ల తనకెంత ప్రేమో, తన కుటుంబ సభ్యుల పట్ల కూడా అంత ప్రేమ. ఆ యితరులు మనిషి కావచ్చు, మర్కటం కావచ్చు లేక ఒక పసిపాప కావచ్చు. ఆయన చేష్టలు బహు సహజంగా వుండేవి. ఈ ప్రపంచంలో ఎలా జీవించాలో ఆయనను చూసి నేర్చుకున్నాం మేము. శ్రీ భగవాన్ జీవన విధానం, వారు చూపిన ఉదాహరణలూ మహోత్కృష్ఠమైన బోధన, వారి దివ్యసన్నిధి, ఒక జీవిత కాలమంతా చేసిన తపస్సు కంటే ఎంతో మిన్నయినది. వారిని స్మరిస్తే చాలు, వారి సన్నిధిలో కూర్చుంటే చాలు, మేము మోక్షానందం పొందేవాళ్ళం. (సశేషం)

## The Divine Mother

Dr. K.Subrahmanian (Talk 18)

The human mother looks after her child without expecting anything from the child. That is why we say that the *karuna,* the compassion of the mother is unique in this world. How much more would be the compassion of the Universal Mother? In his *stuti* of Goddess Annapurna in Kasi, Adi Sankara says,

माता च पार्वती देवी पिता देवो महेश्वरः ।

बान्धवाः शिवभक्ताश्च स्वदेशो भुवनत्रयम् ॥

*Maataa cha Parvatidevi pita devo Maheshwarah*

*Baandhavah Sivabhaktascha svadesho bhuvanatrayam*

The meaning of this verse is, "My mother is Parvati; father is Parameshwara, and all Siva-devotees are my family members. All the three worlds are my country." Further, he says,

नित्यानंदकरी वराभयकरी सौन्दर्य रत्नाकरी

*Nityaanandakarivara - abhayakarisaundarya - rathnakari*

Who can describe all the qualities of Mother Annapurneshwari?

*Nityanandakari*- If she wants, she can give us *ananda* always. *Vara-abhayakari* - she only can give us *abhaya*, fearlessness. That is the most important thing. Morning to evening, there is some fear or the other in our minds, and by the end of the day, we feel so tired. More than the physical work that we do, the mental agony that we go through makes us feel tired. That is why we all want to sleep. Sleep



is not only for the body, it is for the mind as well. The mind that cannot keep quiet – however much it keeps telling itself that it should keep quiet, achieves this only in deep sleep. Some of us think that it is very easy to sleep. But there are several people who cannot sleep, and it is agony for them. And so, what we take for granted, what we think is normal, is because of the grace of the Universal Mother. For this, we must be grateful.

